
నవతెలంగాణ

రూ.18 లక్షలతో బెలారస్‌లో ఎంబీబీఎస్

- నీట్‌లో ఉత్తీర్ణులే విదేశాల్లో చదివేందుకు అర్హులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తూర్పు యూరప్‌లో భాగమైన బెలారస్‌లో ఎంబీబీఎస్ చదివేందుకు మంచి అవకాశాలున్నాయని గొమెల్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీ వైస్ డీన్ డాక్టర్ ఇహర్ పాల్ట్సొ చెప్పారు. రూ.18 లక్షలతోనే బెలారస్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసుకునే అవకాశముందని అన్నారు. జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)లో ఉత్తీర్ణులైన వారే విదేశాల్లో చదివేందుకు అర్హులని వివరించారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గొమెల్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీ ప్రభుత్వరంగంలో ఉందని చెప్పారు. బెలారస్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసినా ప్రపంచవ్యాప్తంగా ఆ డిగ్రీకి గుర్తింపు ఉందన్నారు. గొమెల్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీ 1990లో స్థాపించామని చెప్పారు. సెమిస్టర్‌కు రూ.1.46 లక్షల చొప్పున ఇతర ఖర్చులు కలిపి 12 సెమిస్టర్లకు రూ.18 లక్షల వరకు ఫీజు అవుతుందని చెప్పారు. హాస్టల్ వసతి, భోజనం కోసం ఏడాదికి మరో రూ.లక్ష అదనంగా చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. బెలారస్‌లో ఎంబీబీఎస్ కోర్సు సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభమవుతుందని చెప్పారు. మెడికో అబ్రాడ్ మేనేజింగ్ పార్టనర్ వి రాజారామ్ మాట్లాడుతూ గొమెల్ స్టేట్ మెడికల్ యూనివర్శిటీలో భారత్‌కు 60 సీట్లున్నాయని అన్నారు. అందులో తెలుగు రాష్ట్రాల నుంచి 40 నుంచి 50 మందికి అవకాశముంటుందని చెప్పారు. ఇప్పటికే భారతీయ విద్యార్థులు బెలారస్‌లో 200 మంది చదువుతున్నారని అన్నారు. భారత్‌లో యాజమాన్య కోటాలో ఎంబీబీఎస్ చదవాలంటే రూ.కోటికిపైగా ఖర్చవుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు www.medicoabroad.in లేదా 9959114545 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.